ప్రజాశక్తి
సోమవారం 26 జూన్ 2023
5
విజయనగరం

27న మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఎంఆర్ అటానమస్ డిగ్రీ కళాశాలలో మినీజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి నీలం గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి (2022, 2023 ఉత్తీర్ణత), డిగ్రీలో బిఎస్‌సి, బికాం, బిఎ (2020, 21, 22, 23 ఉత్తీర్ణత) కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి వయస్సు 18 నుంచి 30 ఏళ్ల వారు అర్హులు. జాబ్‌మేళాకు ఎంఎస్ఎన్ లేబోరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపక చేసుకుంటుంది. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను www.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. రిఫరెన్స్ నెంబర్‌తోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలి. మరిన్ని వివరాలకు 7989826953, 8099461303 నంబర్లను లేదా టోల్ ఫ్రీ 9988853335 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుత్తు వినియోగదారులపై దొంగదెబ్బ

విజయనగరంలోని తోటపాలేనికి చెందిన కృష్ణవేణి కూరగాయల బండి నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అదే ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటోంది. గతంలో రూ.250లోపు మాత్రమే కరెంటు బిల్లు వచ్చేది. మేలో రూ.428 బిల్లురావడంతో అవాక్కైన కృష్ణవేణి కరెంటు ఆఫీసుకు వెళ్లి అడగడంతో అసలు కన్నా కొసరు ఛార్జీలే ఎక్కువని తేలడంతో అవాక్కైంది. కృష్ణవేణి కరెంటు బిల్లును పరిశీలిస్తే... మొత్తం 110 యూనిట్ల కరెంటు ఛార్జీ కేవలం రూ.349 విధించారు. ఆపై కస్టమర్ ఛార్జీ రూ.10, డిమాండ్ ఛార్జీ రూ.45, ఇడి ఛార్జీ రూ.6, ఎఫ్‌పిపిఎ ఛార్జీ రూ.21, ట్రూ అప్ ఛార్జీ రూ. 14, ఐఎస్‌డి, టిడిఎస్ ఎరియర్స్ రూ.17 చొప్పున విధించారు. ఇదే విషయాన్ని విద్యుత్తు కస్టమర్ సర్వీస్ సెంటర్ సిబ్బంది చెప్పడంతో కృష్ణవేణి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మునుపెన్నడూ ఇంత మొత్తంలో కరెంటు బిల్లు రాలేదని, అదనపు ఛార్జీల వల్లే ఇంతలా వచ్చిందని ఆవేదన చేసింది. గతంలో ట్రూ అప్ ఛార్జీ, ఎరియర్స్ తదితరాలు ఇంత మొత్తంలో లేవంటూ వాదించినా ఫలితం లేకపోయింది.

తోటపాలెం ప్రాంతంలోని ముచ్చెరువుగట్టుకు చెందిన కిలారి మణి ఇంటి కరెంటు బిల్లు గతంలో రూ.500లోపు వచ్చేది. మే నెల బిల్లు రూ.1225 రావడంతో ఆశ్చర్యపోయింది. ఒక ఫ్యాను ఒక లైటుకు ఇంత మొత్తంలో ఎలా బిల్లు ఇస్తారంటూ సిబ్బందిని ప్రశ్నించగా 'విద్యుత్తు ఛార్జీలు పెరిగాయమ్మా' అంటూ సెలవిచ్చారు.



- కరెంటు ఛార్జీ కన్నా అదనపు భారాలే ఎక్కువ
- భరించలేక పోతున్నామంటున్న ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేవలం ఇది కృష్ణవేణి, మణిపై పడిన విద్యుత్తు భారమే కాదు. విద్యుత్తు వినియోగ ఛార్జీలతోపాటు రకరకాల రూపాల్లో ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచేసింది. ఇప్పటికే 11 నెలల పాటు వినియోగదారులు చెల్లించారు. మరో 25 నెలలపాటు ఇంకా చెల్లించాల్సి ఉంది. ఇది చాలదన్నట్టుగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్తు బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ తాజాగా మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపింది. దీంతో పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు కలిపి 40 పైసలు అవుతోంది. దీన్ని భరించడమే అత్యంత కష్టతరంగా ఉన్న పరిస్థితుల్లో సర్దుబాటు ఛార్జీలు ఇక నుంచి మరుసటి నెలలోనే వసూలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తూచ తప్పకుండా పాటిస్తోంది. ఇందులో భాగంగానే మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్‌లో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80 పైసలు భారం పడుతోంది. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించడంతో సామాన్య కుటుంబాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు వినియోగదారులను ప్రభుత్వం దొంగదెబ్బ తీస్తోందని విమర్శిస్తున్నారు.

ఏప్రిల్‌లో రూ.500.. మేలో రూ.974

ఏప్రిల్ వినియోగానికి సంబంధించి విద్యుత్తు బిల్లు రూ.500 వచ్చింది. ఇప్పటి వరకు రూ.600కు మించి బిల్లు ఎప్పుడూ రాలేదు. మే నెలకు సంబంధించి బిల్లు రూ.974 రావడంతో గుండె గుబేలుమంది. కాయా కష్టం చేసుకుని బతికేటోళ్లం. ఇంతేసి మొత్తం విద్యుత్తు బిల్లుకే కట్టాలంటే కుటుంబాన్ని ఎలా నెట్టుకురాగలం. వైసిపియే కాదు... ఏ ప్రభుత్వానికైనా ఇటువంటి చర్యలు సరికాదు.

– దిబ్బిడి దేవి, బూడి వీధి, పూసపాటిరేగ

ఫ్యాను, లైటుకు రూ.500 బిల్లా?

కూలి దొరికితే తప్ప కూడు దొరకని పరిస్థితి మాది. అందువల్ల ఉదయం నుంచి రాత్రి వరకు ఇంట్లో ఉండే పరిస్థితి లేదు. కేవలం రాత్రి పూట మాత్రమే లైటు వేస్తాం. నిద్రపోయే సమయంలో మాత్రమే ఫ్యాను వేస్తాం. మాకు కూడా రూ.500 బిల్లు వచ్చింది. ఇంతకు ముందు ఇంత మొత్తంలో రాలేదు. ఒకరోజు కష్టమంతా కరెంటు బిల్లుకే సరిపోకపోతే కూడు, గుడ్డ, పిల్లల చదువులు, ఇంటి అద్దెల పరిస్థితి ఏమిటి? వైసిపి అధికారంలోకి వచ్చాక పరిస్థితి చాలా ఘోరంగా ఉంది.

– నాలి గుంపుస్వామి, పూజారిగూడ, కొమరాడ మండలం

సైన్స్ అవార్డుల రద్దు..

శాస్త్రీయతను నిలువరించేందుకే

కేంద్ర వైఖరికి నిసనగా 2న సైన్స్‌వాక్ ● జెవివి ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు విఎస్ ప్రసాద్

శాస్త్రీయ దృక్పథాన్ని నిలువరించేందుకే కేంద్రం ప్రభుత్వం సైన్స్ అవార్డులను రద్దు చేసిందని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయ పడింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాడాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జులై 2న విజయనగరంలోని మహాకవి గురజాడ ఇంటి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సైన్స్ వాక్ నిర్వహించాలని అభిప్రాయ పడింది. ఇందులో అభ్యుదయవాదులు, ప్రజా, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, మేధావులు, వైద్యులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎంవిఎన్ వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ అవార్డుల రద్దు చేయడమంటే శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. వైద్యరంగంలోనూ కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన ఆలోచనలు ప్రవేశపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి విభాగాలను కిచిడీ వైద్యంగా మార్చేయడమంటే ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా చేయడమేనన్నారు. మానవాళి మనుగడలో విప్లవాత్మకమైన మార్పులను గుర్తించిన డార్విన్ సిద్ధాంతం రద్దుచేయడం సరికాదన్నారు. దీనివల్ల వల్ల సమాజం మరింత వెనుకబాటుకు గురౌతుందన్నారు. డార్విన్ సిద్ధాంతంతోపాటు భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, చరిత్రలోని పాఠ్యాంశాలను రద్దుచేయానికి ప్రభుత్వం వద్ద ఉన్న హేతుబద్ధత ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్ మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందితేనే కొత్తకొత్త ఆవిష్కరణలతో దేశాభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. ఇటువంటి సైన్స్‌లో ప్రోత్సాహన్ని తగ్గించేందుకు అవార్డులను కేంద్ర ప్రభుత్వం రద్దుచేస్తున్నట్టు ప్రకటించడం దారుణమన్నారు. ఇప్పటికే పరిశోధనా రంగానికి నిధుల కేటాయింపులు భారీగా తగ్గించిందని వివరించారు. శాస్త్రీయతను నిలువరించి, దాని స్థానంలో ఖర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇటువంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. మరికొన్ని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. శాస్త్రీయ ఆలోచన లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం తీసుకొచ్చిందని, అందులో భాగంగా సమాజాభివృద్ధికి దోహదపడే అనేక పాఠ్యంశాలను రద్దుచేసి, వాటి స్థానంలో ఖర్మకాండ, జ్యోతీశ్యం, వాస్తు వంటి అంశాలను ముందుకు తీసుకొస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహనను పెంచే విజ్ఞాన్ ప్రసార్‌ను కూడా ఇటీవల నిలుపుదల చేసిందన్నారు. తాజాగా శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో 72 అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ నిర్ణయం తీసుకొందన్నారు.

సమావేశంలో జన విజ్ఞాన వేదిక నాయకులు వి.రాజగోపాల్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, ఎపిటిఎఫ్ నాయకులు రౌతు విజయకుమార్, యునైటెడ్ మెడికల్ అసోసియేషన్ నాయకులు జివిఎన్ఎస్ఎన్ మూర్తి, పిఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు జిబి నాయుడు, ఆర్అండ్‌బి ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కె.మురళీబాబు, ఎపి ఎన్‌జిఒ నాయకులు జి.పైడిరాజు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఎన్ నాగభూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్ మహేష్, జెవివి సమతా విభాగం నాయకులు జి. నిర్మల, ఎపిఎంఎస్ఆర్‌యు నాయకులు వి.సూర్యభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘువర్మ, క్రీడాకారులు, యువత

నగరంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక రాజీవ్ స్టేడియం నుంచి కోట వరకు ఈ రన్ నిర్వహించారు. పెద్దఎత్తున యువత , క్రీడాకారులు పరుగులో పాల్గొన్నారు. పరుగులో పాల్గొన్న వారికి నిర్వాహకులు టీషర్టులు, టోపీలు అందజేశారు. ఒలింపిక్ జ్యోతిని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ వెలిగించి, జెండా ఊపి పరుగును ప్రారంభించారు. అనంతరం సీనియర్ క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను, జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ క్రీడాకారులలో సమానత్వం కలిగించి, క్రీడాస్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్‌డే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందువరుసలో ఉండేలా క్రీడలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతోపాటు స్నేహ సంబంధాలు మెరుగు పడతాయన్నారు. చిన్న తనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె.సుభాష్ చంద్రబోస్, డోల మన్మథకుమార్, కోలగట్ల ప్రతాప్, టి.వి.భగవాన్ దాస్, కెవిఎఎన్ రాజు, కమలనాభరావు, కె.సన్యాసినాయుడు, కె.గోపాల్, వి.మల్లేశ్వరరావు, ఎలుగుబంటి రమణ, లీలా కృష్ణ, జి.శ్రీనివాసు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సన్ స్కూల్లో పుస్తకాల అమ్మకం

ఎస్ఎఫ్ఐ ఆందోళనతో సీజ్ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న ఎంఇఒ

నగరంలో సన్ స్కూల్‌లో విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ చేపడుతున్న పుస్తకాల అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ బృందం ఆదివారం అడ్డుకుంది. ఆ స్కూల్ కరస్పాండెంట్ అనిల్.. ఎస్ఎఫ్ఐ నాయకులపై బెదిరింపులకు దిగారు. 'ఏం చేసుకుంటారో చేసుకోండి. పుస్తకాల అమ్మకాలు ఆపబోమ'ంటూ హెచ్చరికలు చేశారు. ఎస్ఎఫ్ఐ ఆందోళనతో అక్కడికి ఎంఇఒ పివిబిఆర్ రాజు, సత్యవతి కలిసి చేరుకున్నారు. పుస్తకాల గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ సన్ స్కూల్ యాజమాన్యం బహిరంగంగా పుస్తకాలు అమ్ముతూ వేలకు వేలు ఫీజులు వసూలు చేయడం అన్యాయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. పుస్తకాల విక్రయాలను అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై కరస్పాండెంట్ అనిల్ బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. సన్ స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ అధికారుల ఉదాసీన వైఖరే అందుకు కారణమన్నారు. పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలను సీజ్ చేసిన అధికారులు సన్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జె.రవికుమార్, ఎం.సౌమ్య, పట్టణ కార్యదర్శి పి.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లావణ్య, సమీర, ఉమ, నాయకులు సోమేశ్, మణికంఠ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కమిషనర్ శ్రీరాములునాయుడు తెలిపారు. ఆదివారం నగరంలో కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన వివరాలను ముమ్మరంగా సేకరించారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు నిర్దేశించిన విధానం ప్రకారం ప్రజల నుంచి ఆధారాలను స్వీకరించి, త్వరలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం సచివాలయాల వారీగా బృందాలను ఏర్పాటు చేయడమే కాకుండా రూపొందించిన డేటా ప్రకారం ఆయా తేదీల్లో ప్రజలను కలిసి కార్యక్రమం విశిష్టతను వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పట్ల పూర్తి అవగాహన పెంచుకొని ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్‌లో జారాకు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లూరులో జరిగిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ బెంచ్‌ప్రెష్ రాష్ట్ర సీనియర్ స్త్రీ, పురుషుల ఛాంపియన్ షిప్ పోటీలో జిల్లాకు చెందిన ఎస్.జారా బంగారు పతకం సాధించారు. మూడు విభాగాల్లో మొత్తం 330 కిలోల బరువు ఎత్తి విజేతగా నిలిచారు.

ఆగస్టులో ఎంబిబిఎస్ అడ్మిషన్లు

ఈ ఏడాది ఆగస్టులో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తామని విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల తెలిపారు. జులై 15 నుంచి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. మరో వైపు భవన నిర్మాణాలు పూర్తవుతున్నాయని, మిగిలిన సదుపాయాల కల్పన కూడా వేగవంతంగా సాగుతోందని వివరించారు. గతంతో పోల్చితే కొత్త వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని, ఐదేళ్ల పీజీ బ్యాచ్ విడుదల అయ్యేనాటికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటుకి వస్తాయని వివరించారు. ఈలోపు క్రమంగా మరికొన్ని విభాగాలు వైద్య కళాశాలకు మంజూరవుతూ ఉంటాయన్నారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- జులై 15 నుంచి కౌన్సిలింగ్‌కు సన్నాహాలు
- మొదటి సంవత్సరానికి 150 సీట్లు మంజూరు
- తగినంతమంది ప్రొఫెసర్ల నియామకం
- భవన నిర్మాణాలు పూర్తి
- 'ప్రజాశక్తి'తో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ పద్మలీల ముఖాముఖి

ఎన్ఎంసి నుంచి అనుమతులు వచ్చేశాయా?.

అవును! చాలా నెలల క్రితమే ఎన్ఎంసి అధికారుల బృందం కళాశాల భవనాలు, క్లినికల్ సదుపాయాలను పరిశీలించింది. సంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా ఇటీవల లెటర్ ఆఫ్ పర్మిషన్ కూడా ఇచ్చారు. కాబట్టి కళాశాల ప్రారంభానికి ఢోకా లేదు.

మెడికల్ సీట్లు ఎన్ని? అడ్మిషన్లు ఎప్పటి నుంచి ప్రారంభమౌతాయి?.

ఈ ఏడాది ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. 150 సీట్లు మంజూరయ్యాయి. జులై 15 నుంచి కౌన్సిలింగ్ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభమౌతాయి.

ప్రొఫెసర్లు నియామకం ఎంత వరకు వచ్చింది?.

కళాశాల మొత్తానికి 222 మంది ప్రొఫెసర్ పోస్టులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు సుమారు 192 పోస్టులు భర్తీ అయ్యాయి. కానీ, మొదటి సంవత్సరం బోధనకు ఇబ్బంది లేదు. మిగతా 30 పోస్టుల్లో కొన్ని రాష్ట్ర కేంద్రం, మరికొన్ని రీజనల్, ఇంకొన్ని కళాశాల స్థాయిలో భర్తీచేయాల్సి ఉంది. ఇవన్నీ క్రమంగా రెండు, మూడు సంవత్సరాల్లో భర్తీచేయాల్సినవే.

మొదటి సంవత్సరం ఏయే విభాగాలు అందుబాటులోకి వస్తాయి?.

సాధారణంగా మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, కమ్యూనిటివ్ మెడిసిన్ వంటి నాలుగు విభాగాలు అవసరమౌతాయి. వీటికి సంబంధించిన టీచింగ్ పరికరాలు యుద్ధ ప్రాతిపదికన సమకూరుస్తున్నారు. ఈ విభాగాలకు అవసరమైన అధ్యాపక బృందమంతా అందుబాటులో ఉంది.

భవన నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి?.



గాజులరేగ పరిధిలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మొదటి సంవత్సరంలో 150 మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, ప్రొఫెసర్ల ఛాంబర్లు, లేబోరేటరీ గదులు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఇటీవలే వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని, వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు.. నిర్మాణాలను పరిశీలించారు. కలెక్టర్ కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. వీరంతా చేసిన సూచనలు, సలహాలతో అక్కడి కాంట్రాక్టరు మార్పులు, చేర్పులు చేస్తున్నారు.

కళాశాల తరపున సమకూర్చాల్సినవి ఏమైనా ఉన్నాయా?.

ఫర్నీచర్, టీచింగ్ మెటీరియల్, లేబోరేటరీ, వైద్య పరికరాలు వంటివి కొనుగోలు చేసే పనిలో ఉన్నాం. ఇవన్నీ యుద్ధ ప్రాతిపదికన సమకూర్చేందుకు కృషిచేస్తున్నాం. ఇప్పటికే బెంచీలు ఏర్పాటు చేస్తున్నాం.

క్లినికల్ సేవలు ఎలా ఉన్నాయి?.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రితోపాటు ఘోషాసుపత్రి కూడా వైద్యకళాశాలకు అనుబంధంగా ఉన్నాయి. ఈ రెండు చోట్ల 430 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. గతం నుంచి ఉన్న మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, డెంటల్, ఆర్థో తదితర విభాగాలకు తోడుగా టీచింగ్‌కు తోడ్పడే అటానమీ, ఫియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ (పెథాలజీ), ఫ్లోరెన్సిక్ మెడిసిన్, ఎస్‌పిఎం తదితర అనుబంధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ విభాగాలు కలుపుకుని మెడికల్ కాలేజీలో మొత్తం 22 విభాగాలు ఉన్నాయి. లేబోరేటరీలో అదనపు సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

సూపర్ స్పెషాలిటీ సేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయి?.

కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఇంకా అందుబాటులోకి రావాల్సి ఉంది. కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాక అండర్ పోస్టుగ్రాడ్యుయేట్ తొలి బ్యాచ్ విడుదల కావాలంటే కనీసం ఐదేళ్ల సమయం పడుతుంది. ఆ తరువాతే కాలేజీలో పీజీ కోర్సులు అందుబాలోకి రానున్నాయి. ఇలా కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులో వచ్చాక మాత్రమే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

ఉప్పొంగిన అభిమానం

అశోక్ జన్మదిన వేడుకల్లో 394 మంది రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రక్తదాతను అభినందిస్తున్న టిడిపి నేత అశోక్‌గజపతిరాజు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుపై ఆ పార్టీ కార్యకర్తలు, యువత తమ అభిమానాన్ని చాటుకున్నారు. అశోక్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి భారీగా తరలివచ్చి రక్తదానం చేశారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. ఈ శిబిరానికి టిడిపి కార్యకర్తలు, అభిమానులు, యువత భారీగా తరలివచ్చారు. 394 మంది రక్తాన్ని దానం చేశారు. అశోక్ రక్తదాతలందరి దగ్గరికి వెళ్లి జ్యూస్ ప్యాకెట్లు, పండ్లు ఇచ్చి అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్, ఎంఆర్, ఎన్‌విఎన్, న్యూలైఫ్, ఎన్‌టిఆర్, రోటరీ బ్లడ్‌బ్యాంకులు రక్తాన్ని సేకరించాయి. రక్తదాతలకు సర్టిఫికెట్లను, ప్రశంసాపత్రాలను అశోక్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఈ సేవ అందరిలోనూ మానవత్వం పెంచుతుందని తెలిపారు. ప్రతిఏటా రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అభిమానులు, కార్యకర్తలు దానం చేసిన రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మివరప్రసాద్, పట్టణ కార్యదర్శి బంగారుబాబు, నాయకులు రాజేష్‌బాబు, బి.నర్సింగరావు, గంట పోలినాయుడు, వి.శ్రీనివాసరావు, కె.మురళీమోహన్, కె.మురళీ, రొంగలి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

ప్రజాశక్తి-విజయనగరంకోట

హక్కుల సాధనకు ఐక్యం పోరాటం చేద్దామని విజయనగరం సెంట్రల్ పారామిలిటరీ, ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజ్, కార్యదర్శి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వుడా కాలనీలో రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ ఏ సమయంలోనైనా ప్రతిఒక్కరూ అందుబాటులోకి రావాలని కోరారు. సమావేశంలో వెంకట్రావు, జనార్దన్‌రావు, శ్రీనివాసరావు,గంగాధర్, గోవిందరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కొండలను తలపిస్తున్న మట్టి నిల్వలు

• వేపాడలో ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్న ఇటుక వ్యాపారులు • డెంకాడలో పేట్రేగిపోతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు • జెసిబితో చెరువుల్లో మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎటువంటి అనుమతులూ లేకుండా ఇటుక బట్టీలను నడపడమే కాకుండా అక్రమంగా మట్టిని తరలించి కొండలను తలపించేలా బట్టీల వద్ద నిల్వ చేసుకుంటున్నారు. బొద్దాం నాలుగు రోడ్ల జంక్షన్ నుండి కొండగంగుపూడి వెళ్లే రహదారికి ఆనుకొని రామస్వామి పేట, వీకేఆర్ పురం రోడ్డును ఆనుకొని, మండల కేంద్రం నుండి ఆనందపురం జంక్షన్‌కు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని చిరపాలెం జంక్షన్ వద్ద అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణతో పాటు అక్రమంగా మట్టి నిల్వలను ఉంచారు. అధికారులు కుమ్మక్కై, రాజకీయ నాయకుల అండదండలతో ఇటుక వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ తీసుకోవడం లేదు. పైగా చెరువులు, గెడ్డల్లో మట్టిని తవ్వి అక్రమంగా బట్టీల వద్దకు తరలించి కొండలను తలపించేలా పోగులు వేసుకుని తమ వ్యాపారం సాగిస్తున్నారు. ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ అధికారులకు మాత్రం లంచాలు ఇచ్చి తమ అక్రమ తవ్వకాలను గుట్టుచప్పుడు కాకుండా చేసుకుంటున్నారని విమర్శలున్నాయి. గ్రామాలకు దగ్గరలోనూ, రోడ్లకు ఇరువైపులా ఇటుక బట్టీలు నిర్వహించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని కూడా పట్టించుకోవడం లేదు. ఇటుక బట్టీలు నిర్వహించాలంటే ల్యాండ్ కన్వర్షన్ కింద ప్రభుత్వానికి మూడు శాతం పన్ను చెల్లించాలని, జివో నెంబర్ 80 ప్రకారం ఆర్ అండ్ బి రహదారికి ఇరువైపులా 500 మీటర్ల దూరంలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా ఇసుక బట్టి యజమానులు ఒక ట్రాక్టర్ ఇటుక లోడుకు 8 వేల నుండి పదివేల వరకు వసూలు చేస్తున్నారు. వర్షాకాలంలో అయితే 12 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ నిర్వహణపై గ్రామ సచివాలయ కార్యదర్శి

వేపాడ: చిరతపాలెం జంక్షన్ వద్ద కొండలను తలపిస్తున్న మట్టి నిల్వలు

పద్మను వివరణ కోరగా పంచాయతీకి ఇంతవరకు ఏ విధమైన పన్నులూ చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటుక బట్టీల వద్ద ఉన్న మట్టి నిల్వలను స్వాధీనం చేసుకుని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బట్టీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బరితెగిస్తున్న రియల్ ఎస్టేట్ యజమానులు

డెంకాడ : రియల్ ఎస్టేట్ యజమానులు భూములు కొని వాటిని సైట్లుగా ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ సైట్లను కప్పుకునేందుకు చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి సైట్లలో వేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీని కోసం ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా రూపాయి ఖర్చు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. అందులో భాగంగానే మండలం లోని జొన్నాడ ఎర్ర చెరువులో మట్టిని జెసిబిల ద్వారా లారీల ద్వారా తమకు ఇష్టం వచ్చినట్టు పెద్ద పెద్ద గుమ్మలు తీసి తరలిస్తున్నారు. గ్రామస్తులు అడ్డుకున్నా వారిని ఎదిరించి మట్టిని లారీలతో తరలిస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా రెవెన్యూ, ఇరిగేషన్, మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్ర చెరువులో పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టి తరలించడం ద్వారా తరువాత ప్రమాద సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తరలించేవారు పంచాయతీ గాని, రెవెన్యూ గాని, ఇరిగేషన్, మైన్స్ అధికారులు కానీ రూపాయి చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని చెబుతున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా పొక్లెయినర్‌తో చెరువులో మట్టి తవ్వి లారీలతో తరలించి చెరువులను ప్రమాదకరంగా తయారు చేస్తున్నారు. పైగా చెరువులు మదుములు కంటే లోతుగా తయారైతే పొలాలకు నీరు ఎలా అందుతుందని రైతులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు .

జెసిబితో మట్టిని తవ్వేస్తున్న అక్రమార్కులు

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

'జగనన్న సురక్ష'తో మేలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతో మేలు జరుగుతోందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు అన్నారు. ఆదివారం ఆయన మొయిద లోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలతో బాటు ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సత్వరంగా అందించడానికి సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమం అమలులో భాగంగా ఈ నెలాఖరు వరకు అవగాహన సదస్సులు నిర్వహించి వచ్చే నెల 1నుంచి ప్రారంభించనున్నారు. అనంతరం జరజాపు పేటలో ఇటీవల కాలంలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు ఎంఎం నాయుడు, మద్దిలవాసు, నల్లి శ్రీను, పాండ్రంకి సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం నిర్మాణం కోసం తీసుకొచ్చిన మెటీరియల్‌ను అన్‌లోడ్ చేస్తున్న లారీ

సచివాలయ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామంలో సచివాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నెల్ వచ్చింది. ఈ గ్రామంలో సచివాలయ నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేయడంతో గ్రామస్తులు ఆ భవనంలో పశువులను కట్టి వినియోగించుకునేవారు. ఈ నేపథ్యంలో పశువులకు నిలయంగా సచివాలయం అనే కథనం ప్రజాశక్తిలో శనివారం వెలువడింది. దీనికి స్పందించిన అధికారులు ఆదివారం సచివాలయం నిర్మాణంలో భాగంగా మెటీరియల్‌ను లారీతో తెచ్చి సచివాలయం వద్ద వేశారు. ప్రజాశక్తి కథనానికి స్పందించి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనికి ఉపయోగించే మెటీరియల్‌ను వేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'జగనన్నను మరిచిపోకండి'

ప్రజాశక్తి- గంట్యాడ

దేశంలోని ఏ రాష్ట్రంలో అందించని పాలనను మన రాష్ట్రంలో అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మర్చిపోరాదని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఆదివారం నీలావతి గ్రామంలో జరిగిన గడపగడప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని గుర్తు చేసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎంపిపి పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి నరసింహమూర్తి గ్రామ సర్పంచ్ సుధారాణి, ఎంపిటిసి గుల్లిపల్లి మంగమ్మ, కార్యకర్తలు, పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

టెన్నీస్‌లో గెలిపొందిన విజేతలు

టెన్నీస్ ఫైనల్స్ విజేతలు వీరే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో లాన్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. లాన్ టెన్నీస్ సింగిల్స్‌లో విన్నర్‌గా బి. మహేష్, రన్నర్‌గా పి.ఎన్. రాజు నిలిచారు. డబుల్స్‌లో విన్నర్‌గా టి. రామారావు, సుదర్శన్ రాజు, రన్నర్స్‌లో జి. సన్యాసి రాజు, ఎస్. ప్రశాంత్ విజేతలుగా నిలిచారు. లాన్ టెన్నిస్ విజేతలకు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.2500 ప్రోత్సాహక బహుమతి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, టెన్నీస్ కోచ్ ఆర్. శ్రీకాంత్, క్రీడల సహాయ సంచాలకులు డి. నారాయణరావు, ఎస్టేట్ అధికారి ఎస్.ఎస్.రావుతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న చీఫ్ జస్టిస్, తదితరులు

తాడ్డి కుటుంబానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ పరామర్శ

ప్రజాశక్తి - గజపతినగరం

మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు కుటుంబాన్ని యాక్టింగ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.వి శేషసాయి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ఓదార్పును అందించారు. ఈయనతో పాటు జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి, విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, గజపతినగరం సెషన్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి, ఎపి వేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మెన్ గోపి, ఆర్‌డిఒ శేష శైలజ, తహశీల్దార్ ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో నేడు మంత్రి పర్యటన

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలో సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పర్యటించనున్నట్లు ఎంపిడిఒ ఎం. రత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో ఉదయం మండల కేంద్రంలో డిసి సిబి బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఉత్తరావిల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, విజయనగరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

ఉప సర్పంచ్‌కి నివాళి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

మండలంలోని అలజంగి గ్రామ ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మంనాయుడు ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించిన సంగతి తెలిసిందే. ఆదివారం గ్రామంలో ఆయన పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే ఎస్‌విసిహెచ్ అప్పలనాయుడు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ పార్టీ ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, వివిధ గ్రామ సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీకి గౌరవం లేదు

విజయనగరం టౌన్: రాజ్యాంగం పట్ల ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఎంత మాత్రమూ గౌరవం లేదని, అందుకే రాజ్యాంగ పీఠికను మార్చేందుకు ప్రయత్నం చేసిందని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం గురజాడ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం, అందులోని అంశాల గురించి ప్రజలకు తెలియపరచడం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఏరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాతీయ నాయకులు గంద్రేటి లక్ష్మణరావు, జి.అప్పలనాయుడు, పాల్గొన్నారు.

ఉప గణాంక అధికారిగా గణేష్

విజయనగరం: జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న ఎం.ఎస్.ఆర్. గణేష్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులను జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు గణేష్‌కు అందజేసి అభినందించారు. డ్వామాలో గణేష్ ఉపగణాంక అధికారిగా నియమితులయ్యారు.

జాప్ జిల్లా కార్యవర్గం

విజయనగరంకోట: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక సత్యవిజన్ కార్యాలయంలో జాప్ సర్వసభ్య సమావేశాన్ని పూర్వ అధ్యక్షులు అవనాపు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా మానాపురం రవిచంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పరశురాం ఎన్నికయ్యారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అయ్యన్నపేట జంక్షన్‌లోని మదర్ థెరిస్సా కిడ్స్ స్కూల్లో విద్యార్థులకు మదర్ థెరిస్సా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

ట్రాన్స్‌జెండర్ల జీవిత సంఘర్షణే 'అర్ధనారి'

ప్రజాశక్తి- రాజాం

నేటి సమాజంలో ఆడ, మగ కాని ట్రాన్స్‌జెండర్స్ జీవిత సంఘర్షణనే బండి నారాయణస్వామి 'అర్ధనారి' నవలగా తీర్చిదిద్దారని ప్రముఖ సాహితీవేత్త రాజాపు శాంతారావు అన్నారు. ఈ నవలలో హిజ్రాల సంఘర్షణ పాటు వేశ్యల బాధాకరమైన జీవితాలను కూడా వాస్తవ రూపంలో వర్ణించారని ఆయన చెప్పారు. ఆదివారం స్థానిక విద్యా నికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 101వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాంతారావు ముఖ్యవక్తగా 'అర్ధనారి నవలలో సామాజిక పరిశీలన' అనే అంశంపై మాట్లాడారు. పురుషులు స్త్రీలుగా మారే క్రమంలో ట్రాన్స్‌జెండర్‌గా స్థిరపడడం, సంఘం వారిపై చూపించే చిన్నచూపు, హిజ్రాలను, వేశ్యలను పోలీసులు పెట్టే హింసను చక్కగా చిత్రించారని చెప్పారు. ధనిక ట్రాన్స్‌జెండర్స్, పేద ట్రాన్స్‌జెండర్స్‌ల మధ్య సమాజం చూపే భిన్నమైన చూపును, పేదింటి తల్లిదండ్రులే తమ పిల్లలు ట్రాన్స్‌జెండర్స్ మారితే చూసే హీనమైన దృష్టిని ఆయన వివరించారు. ఇకనైనా సమాజం ట్రాన్స్‌జెండర్స్ పట్ల ఆదరణ భావంతో, సమభావంతో ప్రవర్తించాలని శాంతారావు కోరారు. ఈ సందర్భంగా శాంతారావును వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు.

:శాంతారావును సత్కరిస్తున్న వేధిక సభ్యులు

డాక్టర్ ఆల్తి మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు గణపతిరావు నాయుడు, నేతేటి గణేశ్వరరావు, పెంకి దయానిధి నాయుడు, శాసపు సత్యనారాయణ, పిల్లా తిరుపతిరావు, శాశపు జయలక్ష్మి, పొట్నూరు కోటిబాబు, కుదమ తిరుమలరావు, దన్నాన రామారావు, సమతం మహేశ్వరరావు, మూడడ్ల శ్రీనివాసరావు, పడాల కవీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ యువతకు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సాధన యువజన సంఘం ఇతర సంఘాలకు స్ఫూర్తిగా నిలిస్తోందని ఇండియన్ రెడ్ క్రాస్ ఛైర్మెన్ కెఆర్‌డి ప్రసాద రావు తెలిపారు. ఆదివారం జరజాపుపేట సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ ఛైర్మెన్ ప్రసాదరావు, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ సాధన యువజన సంఘం సేవలను కొనియాడి, గ్రామంతో వారికి ఉన్న అనుబంధాన్ని చెప్తూ సేవలో జరజాపుపేట ముందు వరుసలో ఉంటుందని ముక్తకంఠంతో చెప్పారు. అనంతరం సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శిబిరంలో సుమారు 250మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని వీరిలో 48మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి విశాఖపట్టణం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటివెలుగు, ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితి సాయి కుమార్, మిత్రమా వెల్ఫేర్ అసోసియేషన్ మద్దిల త్రినాధ్, కంటుబోతు గౌరి, ఉషోదయ యూత్ నామాల తిరుపతి రావు, పోస్ట్ మాస్టర్ శ్రీను, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశ డైరెక్టర్ మద్దిల వాసు, కౌన్సిలర్స్ పాండ్రంకి సత్యనారాయణ, తుమ్ము నారాయణ మూర్తి, అవనాపు మురళి కృష్ణ, పోలుభోతు నారాయణ మూర్తి, నల్లి శేఖర్, ఎంఎం నాయుడు, మద్దిల శ్రీనివాసరావు, కాళ్ళ రాజశేఖర్, కిల్లంపల్లి రామారావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, వివిధ యువజన సంఘాలు, సాధన యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ ప్రసాద్‌రావు

రాజాం: స్థానిక కరూర్ వైశ్య బ్యాంక్, 107వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సాయికిరణ్ మాట్లాడుతూ 107 సంవత్సరాలుగా ప్రజలకు చేరువై ఆర్థిక పరిపుష్టికి దోహదపడటం సంతోషమన్నారు. ఈ శిబిరంలో 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గార రవి ప్రసాద్, సిఐ.రవి కుమార్, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్, పాలవలస శ్రీనివాస రావు, అడ్వకేట్ అర్. జయదేవ్, నీలకంటేశ్వర యాదవ్, రెడ్ క్రాస్ సభ్యులు ప్రకాష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం

బొబ్బిలి: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలు కోసం ఇండియన్ బ్లడ్

బొబ్బిలి: రక్తదానం చేస్తున్న జనసేన నాయకులు, యువత

బ్రదర్స్ ఆధ్వర్యంలో స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాలలో ఆదివారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి, వీర మహిళ బి.దివ్య, జనసేన కార్యకర్తలు, యువత పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాబు పాలూరి మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు 21రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాలన్నారు. వారి కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. 135మంది నుంచి విజయనగరం ఎస్.వి.ఎన్ రక్తనిది సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

అందరికీ మేనిఫెస్టో తెలియాలి: గొంప

ప్రజాశక్తి - వేపాడ

అందరికీ టిడిపి మేనిఫెస్టో గురించి తెలియాలని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు గొంప కృష్ణ అన్నారు. ఆదివారం, వేపాడ, ఆతవ గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అధ్యక్షతన టిడిపి మేనిఫెస్టో గురించి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ లేనిపోని మాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కి తమ ఆస్తులను పెంచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు, యువతకు శాశ్వతంగా ఉపయోగపడే ఏ ఒక్క పని చేయలేదని మండిపడ్డారు. మద్యపాన నిషేధమని అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో విచ్చలవిడిగా తన సొంత మద్యాన్ని తెచ్చి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా

సమావేశంలో మాట్లాడుతున్న గొంప కృష్ణ

మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు ఈశ్వరరావు, ఐటీడిపి మండల అధ్యక్షుడు సేనాపతి గణేష్, నాయకులు సిరికి రామలక్ష్మి, రమణ, ప్రసాద్, బాలకృష్ణ, అప్పలసూరి, సేనాపతి అప్పారావు, అర్జున్ రావు, సేనాపతి లీల, పల్లె ధనుంజయ, కెవిపి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలి

నెల్లిమర్ల: ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రం వద్ద వినియోగదారులతో కలిసి నిరశన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచి వినియోగ దారులపై భారం మోపడం దారుణమన్నారు. గతంలో 200, 300 బిల్లులు వచ్చిన వారికి ఇప్పుడు రూ. 500 నుంచి 1000 రూపాయల వరకు బిల్లులు రావడం అన్యాయమన్నారు. ప్రభుత్వం అదనపు చార్జీల పేరిట వినియోగదారుల పై మోయరాని భారం మోపి ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. పురిగుడెసి వినియోగదార్లకు 200 యూనిట్లు వరకూ ఉచితంగా ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. గతంలో సంవత్సరానికి, రెండు సంవత్సరాలకు ఒకసారి విద్యుత్ ఛార్జీలు పెంచేవారని ప్రస్తుతం ప్రతీ నెలా పెంచుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఈ నెల 30న ఆందోళన చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

వినియోగదారులతో మాట్లాడుతున్న రామారావు

మిగులు సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోగల అక్కివరం మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు బిసి, ఒసిలు రూ. 150, ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 100మ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటుగా స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. అభ్యర్థులకు జూన్ 30న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్ష ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని, తెలుగు, ఇంగ్లీష్, మాథ్స్, సైన్స్, సోషల్ మొత్తం ఐదు సబ్జెక్టుల్లో 100 మార్కులకు నిర్వహిస్తామని వెల్లడించారు. పరీక్షల్లో వచ్చే మెరిట్ మార్కులను బట్టి జిల్లా విద్య కమిటీ ఎంపిక చేస్తోందన్నారు.

ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్

వేపాడ: స్థానిక అంబేద్కర్ గురుకులంలో మిగులు సీట్లుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ టిఎం ఫ్లోరెన్స్ ఆదివారం తెలిపారు. గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగులు ఉన్న సీట్లు భర్తీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 28 నాటికి వేపాడ గురుకుల పాఠశాలకు ధరఖాస్తులు అందించాలన్నారు. ధరఖాస్తుతో పాటు ఆధార్, కుల ధృవీకరణ పత్రం జెరాక్స్‌లు జత చేయాలన్నారు. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు అబ్జెక్టివ్ తరహాలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. 6వ తరగతికి 33 సీట్లు, 7వ తరగతికి 26 సీట్లు, 8వ తరగతికి 15 సీట్లు, 9వ తరగతికి 9 సీట్లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

జనసేనలో 200 కుటుంబాలు చేరిక

భోగాపురం : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఆదివారం వైసిపి, టిడిపిలకు చెందిన సుమారు 200 కుటుంబాలు జనసేన నాయకులు లోకం మాధవి ఆధ్వర్యంలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పన్నపేట గ్రామానికి చెందిన ప్రజలు మాట్లాడుతూ గత 25 ఏళ్ల నుండి ఆ రెండు పార్టీలకు కొమ్ముకాస్తున్న తమని కేవలం వారి స్వార్ధ ప్రయోజనాలకే వాడుకొని గాలికి వదిలేశారన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాన్ని అభివృద్ధి బాటలో పెడతారన్న నాయకుల మాటలు నమ్మి వారికి అండగా నిలబడితే ఎన్నికల తర్వాత అదే నాయకులు మొండి చేయి చూపించారని వాపోయారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆలోచన విధానం, తమ పిల్లలకి 25 ఏళ్ల బంగారు భవిష్యత్తు కల్పిస్తారన్న నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. స్థానిక నాయకులు లోకం మాధవి నాయకత్వం, ఆవిడ నియోజకవర్గంలో పేద ప్రజలకి చేసే సేవా కార్యక్రమాలు, ఆపదలో ఉన్న వారిని ఆమె ఆదుకున్న తీరు కూడా తమకు బాగా నచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అయిన యర్ర రాము, వనం అడివులు, వనం అప్పన్న, వనం నారాయణ, నర్సయ్య, జనసేన మండల అధ్యక్షుడు వందనాల రమణ, నాయకులు పల్లా రాంబాబు, పల్లంట్ల జగదీష్ పాల్గొన్నారు.

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Roc.No.384/2022/E1, Dt.24.06.2023

Sl.No.	Nit No.	No. of works	Estimated cost
1	04/2023-24/DyEE/1-30,dt.26.06.2023	30	Rs. 82.78 Lakhs

Bid Document Downloading Start Date	: 26.06.2023 at 11.00 AM
Bid Document Downloading End Date	: 03.07.2023 at 11.00 AM
Last Date & Time for receipt of Bids	: 03.07.2023 at 03.00 PM
Technical Bid opening Date	: 03.07.2023 at 04.00 PM

Note: Other details please read e.procurement market plan
https://tender.apeprocurement.gov.in

Commissioner,
Bobbili Municipality

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, VIZIANAGARAM.
G.O.P.NO. 10/2023

Between:
Ayapilli Venkata Satya Ravi Kumar --Petitioner.
And: NIL --Respondents.

PUBLIC NOTICE

Public hereby informed that the above named petitioner filed petition u/s. 10 of the Guardian and Wards Act to accord permission to appoint him as guardian for his minor daughter viz., Ayapilli Sri Mahalakshmi for execution of registered mortgage deed in favour of VZM Municipal Corporation for approval of plan for construction of house in the premises bearing Door No. 25-4-7 in an extent of 177.22 square yards situated in Sitharamarajupeta Gedda Veedhi, Vizianagaram. The said matter is posted to **11.07.2023** for general notice and publication. Hence, public hereby requested to put their objections if any in this regard on the above date before the Honourable Court and if nobody is turned on that day, the matter will be decided according to law as per the material available.

CH. PRAVEEN RAJU
Advocate for the Petitioner.
Vizianagaram